ప్రజాశక్తి

గురువారం 26 అక్టోబర్ 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

జెడ్‌పి సిఇఒగా పోలినాయుడు



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : విశాఖ జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా ఎం.పోలినాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వి.మాడుగుల ఎంపిడిఒగా కొంతకాలం పనిచేసిన ఆయన ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఒఎస్‌డిగా పనిచేస్తున్నారు. సిఇఒగా పనిచేస్తున్న పి.శ్రీరామమూర్తిని మాతృసంస్థ సహకార శాఖకు పంపించి ఆయన స్థానంలో పోలినాయుడును నియమించింది. 2007 బ్యాచ్ గ్రూప్-1కు చెందిన పోలినాయుడు గతంలో శ్రీకాకుళం జిల్లాలో పనిచేశారు.

జలాశయాల్లో తగ్గుతున్న నీరు

- వరికి నీటి సరఫరా లేక ఆందోళన
- ఇదే పరిస్థితి కొనసాగితే పంటపై ప్రభావం



పెద్దేరు జలాశయం నీరు అందక కవగుంటలో ఎండిపోతున్న వరి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వర్షాల్లేమితో జలాశయాల కింద ఆయకట్టు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పొట్ట దశలో వరికి అవసరమైన నీరు అందించగలిగిన సామర్థ్యం జలాశయాలకు లేదు. పెద్దేరు మినహా మిగిలిన మూడు జలాశయాలు పూర్తిస్థాయి నీటి సామర్థ్యానికి దరిదాపుల్లో లేవు. దీంతో వరి పంటకు చివరి వరకు సరిపడా నీరు అందుతుందా? లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పరీవాహక ప్రాంతాల్లో తగినంత వర్షాల్లేకపోవడంతో జలాశయాల్లోకి వచ్చే నీటి ప్రవాహం తక్కువగా ఉంది. ఈ నెలలో వర్షాలు సరిగా కురవకపోవడంతో జలాశయాల నీటిపై రైతులు పూర్తిగా ఆధారపడి సాగుచేస్తున్నారు. జిల్లాలోని నాలుగు జలాశయాల కింద నీటిపారుదలశాఖ లెక్కల ప్రకారం 75,414 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంట్లో ఖరీఫ్‌లో 60,269 ఎకరాల్లో వరి సాగైంది. వాస్తవ సాగులో 85 శాతం నమోదైంది. నీరు సరిగా సరఫరా చేయలేకపోవడంతో ఈ ఆయకట్టుకు కూడా సాగునీరు అందించలేని దుస్థితిలో అవి ఉన్నాయి. దీంతో వరి పంట 20వేల ఎకరాల వరకు దెబ్బతినే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. తాండవ జలాశయ ఆయకట్టు 32,689 ఎకరాల్లో 22,140 ఎకరాలు, రైవాడ ఆయకట్టు 15,344 ఎకరాల్లో 14,352 ఎకరాలు, కోనాం ఆయకట్టు 12,276 ఎకరాల్లో 11,620 ఎకరాలు, పెద్దేరు ఆయకట్టు

మిగతా 2లో..



వార్త 8లో..

సిపిఎం ప్రజా ప్రణాళికను విడుదల చేస్తున్న జగ్గునాయుడు తదితరులు

సిపిఎం ప్రజా ప్రణాళిక విడుదల

- 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి
- 1 నుంచి రాష్ట్ర బస్సుయాత్రలు
- 3, 4 తేదీల్లో విశాఖలో...
- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు వెల్లడి



నూతన కోర్టుల భవనాల సముదాయం

నూతన భవనంలోకి కోర్టులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం జిల్లా కోర్టు సముదాయంలో నూతనంగా నిర్మాణమైన 'కోర్టుల కాంప్లెక్స్' (10కోర్టు బిల్డింగ్) పూర్తిగా సిద్ధమై విధుల నిర్వహణ కూడా ప్రారంభమైంది. మొత్తం 4 ఫ్లోర్ల భవన సముదాయంలో రెండు ఫ్లోర్లు కార్లు, టూ వీలర్ పార్కింగ్ కోసం, మిగతా రెండు ఫ్లోర్లు కోర్టుల కోసం కేటాయించారు. ఈ మేరకు పాత జిల్లా కోర్టు ఆవరణలోగల 10 కోర్టులు బుధవారం న్యూ కోర్టు బిల్డింగ్ (ఎన్‌సిబి)లోకి షిఫ్టు అయ్యాయి. లాయర్లు, జడ్జిలు, సిబ్బంది వందల సంఖ్యలో అక్కడకు బుధవారం తరలివెళ్లారు. ఇక్కడ కోర్టు బిల్డింగ్ కాంప్లెక్స్ (సిబిసి)లో 2 ఫ్యామిలీ కోర్టులు, 5 అడిషనల్ జిల్లా కోర్టులు, 2 సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు మొత్తంగా షిఫ్టు కావడం విశేషం. భవన సముదాయాలను ప్రారంభించినప్పుడు ఈ నెల 25నాటికి

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జలాశయాల్లో తగ్గుతున్న నీరు

15,105 ఎకరాల్లో 12,157 ఎకరాల్లో వరి సాగు జరిగింది.

గతేడాది కంటే జలాశయాల్లో నీరు తక్కువగా ఉంది. వర్షాలు కురవడంతో ఆయకట్టుకు పెద్ద సమస్య ఏర్పడలేదు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేకపోవడం, ఉన్న నీటిని సరఫరా చేయడానికి తగినట్లు జలాశయాలు, వాటి కాలువలను నిర్వహించకపోవడంతో ఆయకట్టుపై తీవ్రమైన ప్రభావం పడింది. బుధవారం నాటికి తాండవ జలాశయ పూర్తిస్థాయి నీటిమట్ట సామర్థ్యం 380 అడుగులకు గతేడాది 378 అడుగుల నీరుండగా, ఈ ఏడాది 357 అడుగులు ఉంది. రైవాడ సామర్థ్యం 114 మీటర్లకు గతేడాది 113 మీటర్లుండగా ఈ ఏడాది 109 మీటర్లు ఉంది. కోనాం సామర్థ్యం 101 మీటర్లకు గతేడాది 100 మీటర్ల వరకు ఉంది. ఈ ఏడాది 93 మీటర్లకు పడిపోయింది. పెద్దేరు సామర్థ్యం 137 మీటర్లకు గతేడాది 135 మీటర్లు ఉండగా, ఈ ఏడాది కాస్త దగ్గరగా 134 మీటర్ల నీరు ఉంది.

నూతన భవనంలోకి కోర్టులు

కొన్ని కోర్టులు ఎన్‌సిబిసి నుంచి విధులు నిర్వహిస్తాయని ఎపి హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ సెప్టెంబర్ 24న వెల్లడించారు. ఎపి హై కోర్టు కూడా ఈ కోర్టులు నూతన భవన సముదాయంలోకి మారేందుకు ఇటీవలే అనుమతి ఇచ్చింది. సిబ్బంది, ఉద్యోగులు ఇప్పటికే దీంట్లోకి అవసరమైన డాక్యుమెంట్లను చేరవేశారు. కోర్టులకు సంబంధించిన పత్రాలు, ఫర్నిచర్ అంతటినీ పొందుపరచుకున్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో 22 కోర్టులు

జిల్లా నూతన కోర్టు భవన సముదాయాల కోసం 2007లోనే పునాదిరాయి పడినప్పటికీ 2017 వరకూ పనులు ప్రారంభం కాలేదు. 2017 తర్వాత నూతన కోర్టు కాంప్లెక్స్ పనులు ఊపందుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత పనులు ప్రారంభమై 2023 నాటికి పూర్తయింది. సుమారు రూ.35 నుంచి రూ.40కోట్ల వరకూ ఖర్చు జరిగిందని తెలుస్తోంది. వాస్తవానికి ఈ నూతన కోర్టు భవన సముదాయంలో 22 కోర్టులు ఏర్పాటు చేసుకోడానికి స్థలం, అవకాశం ఉంది. ప్రస్తుత షిఫ్టింగ్ 10 కోర్టులకే పరిమితం చేశారు. ఎందుకంటే పాత కోర్టు భవనాలను సైతం కోర్టు వ్యవహారాలకు వినియోగించనున్నారు. కోర్టు ప్రాంగణంలోకి రెగ్యులర్‌గా సుమారు 3వేల మందికి పైగా వచ్చి పోతూ ఉంటారు. పిటిషనర్లను సైతం అవసరమైన మేరకు నూతన భవన సముదాయంలోకి వెళ్లి పిటిషన్లను అందజేసేలాగ చర్యలు తీసుకుంటున్నారు. ఈ నూతన సముదాయంలోకి ఫామిలీ కోర్టు కూడా షిఫ్టు కావడంతో చిన్న పిల్లలతో వచ్చిన మహిళలకు అధునాతన సదుపాయాలు కల్పించేలాగ ఏర్పాట్లు ఉన్నాయి. ఇవన్నీ నిబంధనల ప్రకారమే అమర్చినట్లు న్యాయవాదులు చెబుతున్నారు. పిటిషనర్ల కోసం వెయిటింగ్ హాల్స్, అధునాతన టాయ్‌లెట్స్ ఏర్పాటు చేశారు. నూతన కోర్టు భవన సముదాయంలో సుమారు 1000 వెహికల్స్ పార్కింగ్, దీంట్లో 800 టూ వీలర్ల సౌకర్యం ఉంది. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల భవనాల్లోనూ ఎసి సదుపాయం కూడా రానున్నట్లు తెలుస్తోంది. విశాఖలోనూ మరో 3 నాలుగు నెలల్లో ఎయిర్ కండిషన్ సదుపాయం రానుంది.

కనెక్టివిటీ కొంచెం ఇబ్బందే: పలువురు లాయర్లు

పాత కోర్టు కాంప్లెక్స్ నుంచి కొత్త కాంప్లెక్స్‌లోకి వెళ్లేందుకు సరైన కనెక్టివిటీ లేదని పలువురు లాయర్లు తాజాగా భావిస్తున్నారు. నూతనంగా నిర్మితమైన కోర్టు సముదాయంలోకి పాత కోర్టు పై నుంచి రావడానికి సమస్య లేదు. కింది కోర్టు నుంచి మీద కోర్టుకు వెళ్లాలంటే మెట్ల మార్గం సరిగ్గా చేయలేదని చెబుతున్నారు. పాత కోర్టులోకి కొత్త భవంతుల్లోకి ఏదైనా కోర్టు మేటర్ కోసం రావాల్సి ఉంటే కొంత ఇబ్బంది తప్పదని వాపోతున్నారు.

నాకౌట్‌కు సిటీ పోలీసు క్రికెట్ జట్టు అర్హత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో సిటీ పోలీసు క్రికెట్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి నాకౌట్‌కు అర్హత సాధించింది. బుధవారం గాజువాక జింక్ గ్రౌండ్‌లో నేవల్ డాక్ యార్డ్‌తో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం సిటీ పోలీస్ క్రికెట్ జట్టు 1 వికెట్ తేడాతో విజయం సాధించింది.

ఐకానిక్ వీట్ హాక్స్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అవాంఛిత రోమాలను నిర్మూలన ఉత్పత్తులలో అగ్రగామిగా ఉన్న వీట్, "ఐకానిక్ వీట్ హాక్స్"ను విడుదల చేసింది. నగరంలోని ప్రముఖ హోటలక్షలో ఈ క్యాంపైన్‌ను బుధవారం ప్రాంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి రెకిట్ మాట్లాడుతూ, భారతదేశంలో వివిధ పండగల వేళా తమ ఉత్పత్తులను ప్రచారం చేసేందుకు ఈ క్యాంపైన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.

చట్టసభల్లో ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశవ్యాప్తంగా జనాభాలో 40 శాతం ఉన్న ఒబిసిలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దారుణానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్‌ను దేశ ప్రధాని మోడీ సమర్థించడం భారతదేశానికి అవమానకరమన్నారు. జిఎస్‌టితో ధరలు పెరిగాయన్నారు. చివరికి మందులపైన కూడా జిఎస్‌టి వసూలు చేస్తున్నారన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యమే లేదన్నారు. మైకుకు అనుమతులడిగితే పొల్యూషన్ సర్టిఫికెట్ అడగడం హాస్యాస్పదమన్నారు. వైసిపి అప్రజాస్వామ్య పద్ధతిలో వెళుతుందన్నారు. జాతీయ నూతన విద్యా విధానం అమలు చేస్తూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు. ఎపిలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నూతన విద్యా విధానాన్ని రద్దు చేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాలు, యువత వైసిపి మద్యం విధానంతో చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. చంద్రబాబును అరెస్టు చేయడం తప్పు అన్నారు. ఆధారాలు లేకుండా సీనియర్ రాజకీయవేత్తను హింసించడం సరికాదన్నారు. 85 ఏళ్ల మార్గదర్శి అధినేత రామోజీరావుపై ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. ఐపిఎస్ అధికారులు ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో కాకుండా ఇండియన్ పొలిటికల్ సర్వీసులో పనిచేస్తున్నట్లుందని ఎద్దేవా చేశారు. న్యాయస్థానాలపై కూడా నమ్మకాలు పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. జడ్జిమెంట్లు ఢిల్లీలో తయారవుతున్నాయని, వీటిలో బిజెపి పాత్ర ఉందని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. లీడర్లు, క్యాడర్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు తప్ప కాంగ్రెస్‌కు ప్రజలలో ఓటింగ్ శాతం పెరిగిందని తెలిపారు. ప్రాంతీయ పార్టీలతో కలిసి కాంగ్రెస్ భవిష్యత్తు ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలో రాబోతుందన్నారు.

మంత్రులు రోజా, నారాయణస్వామి వ్యాఖ్యలపై టిడిపి నిరసన


ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మంత్రులు రోజా, నారాయణస్వామి వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం టిడిపి కార్యాలయం వద్ద జిల్లా తెలుగు మహిళ అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి ఆధ్వర్యాన వినూత్న నిరసన తెలిపారు. మంత్రులు రోజా, నారాయణస్వామి మాస్కులు వేసుకున్న వారికి గడ్డి తినిపించారు. జగన్ చేసిన దోపిడీనీ, భువనేశ్వరి ఎన్‌టిఆర్ ట్రస్ట్ పేరుతో చేస్తున్న సేవ కార్యక్రమాలను ప్లెక్సీ ముద్రించి ప్రజలకు తెలియజేసారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ భువనేశ్వరిపై వైసిపి మంత్రుల చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారు అన్నం తినటం లేదు, అందుకే మంత్రులు రోజా నారాయణ స్వామిలకు గడ్డి పెట్టామన్నారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా భువనేశ్వరి అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. జగన్ సొంత డబ్బులతో ఒక్క సేవా కార్యక్రమమైనా చేశారా అని ప్రశ్నించారు. నిజం గెలవాలని ఆమె పోరాటం చేస్తుంటే, అనుచిత వ్యాఖ్యలు చేస్తారా అని ప్రశ్నించారు.



గడ్డి మేపిస్తూ నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

'శ్రీకాంత కృష్ణమాచార్య'కు బహుమతుల పంట

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : తెనాలిలోని కళల కాణాచి, వేద గంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యాన తెనాలి రామకృష్ణ కళాక్షేత్రంలో నిర్వహించిన పద్య నాటక పోటీలలో విశాఖ నగరానికి చెందిన జయ కళానికేతన్ బృందానికి బహుమతుల పంట పండింది. వీరు ప్రదర్శించిన "శ్రీకాంత కృష్ణమాచార్య" నాటకానికి ఉత్తమ ద్వితీయ బహుమతి (వెండి వీణ)తో పాటు ఉత్తమ నటుడు, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ సంగీతం, ఉత్తమ రంగాలంకరణ, ఉత్తమ లైటింగ్ విభాగాల్లో బహుమతులు వచ్చాయి. ఈ నెల 20వ తేదీ నుంచి జరిగిన పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పద్య నాటకంలో నటించిన కె.వెంకటేశ్వరరావు ఉత్తమ నటునిగా, ఎస్.డేవిడ్ రాజు ఉత్తమ హాస్య నటుడిగా, మురళి ఉత్తమ సంగీతం, సురభి సంతోష్‌కు ఉత్తమ లైటింగ్, ఉత్తమ రంగాలంకరణ అవార్డులు వచ్చాయి. ప్రముఖ సినీ దర్శకులు వంశీ, రాజా వన్నెం రెడ్డి, నటులు ప్రదీప్‌తో పాటు కళా రంగానికి చెందిన అనేక మంది నిష్ణాతులు బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొని "శ్రీకాంత కృష్ణమాచార్య" సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ శ్రీకాంత కృష్ణమాచార్య పద్య నాటకాన్ని నగరానికి చెందిన కీర్తిశేషులు విరియాల లక్ష్మీపతి రచించగా, కె.వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించారు. 30 మంది కళాకారు పాల్గొన్నారు.



వెండి వీణను అందుకుంటున్న కళాకారులు

రైతుబజార్లలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని పెందుర్తి, ములగాడ రైతు బజార్లలో ఖాళీగా ఉన్న ఎస్టేట్ అధికారుల (ఇఒ) పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఒసి, బిసి (సి) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 34 ఏళ్ల వయస్సుండి, బిఎస్‌సి (హార్టీకల్చర్), బిఎస్‌సి (అగ్రికల్చర్), ఎంబిఎ పూర్తి చేసిన వారు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు గోపాలపట్నం రైతుబజార్ పక్కన ఉన్న జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి కార్యాలయాన్ని, 7331154978 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కంచరపాలెం, ఎంవిపి కాలనీ, నరసింహనగర్, మద్రిపాలెం, గాజువాక, పెదగంట్యాడ రైతుబజార్లలో ఖాళీగా ఉన్న సెక్యూరిటీ గార్డు పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నామని తెలిపారు. 10వ తరగతి పాసైన అభ్యర్థులంతా అర్హులేనని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు, గోపాలపట్నం రైతుబజార్ పక్కనే ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ తరపున జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'వైసిపిది తుస్సు యాత్ర'


ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపిది బస్సు యాత్ర కాదు తుస్సు యాత్ర అని, వచ్చే దసరాకు ఆ పార్టీ కనుమరుగవుతుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలను మరలా మోసం చేయడానికే వైసిపి బస్సు యాత్ర పేరుతో బయలుదేరుతుందన్నారు. బిసి, ఎస్‌సి, మైనారిటీలను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గతంలో చంద్రబాబు పెట్టిన అనేక పథకాలను జగన్ తీసేసారని మండి పడ్డారు. సిఎం జగన్ సభలకు ప్రజలు రావడం లేదని, బెదిరించి తరలిస్తున్నారని ఆరోపించారు. రూ.11 లక్షల కోట్లు వైసిపి ప్రభుత్వం అప్పు చేసి, రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు పావలా ఇచ్చి ముప్పవలా లాక్కుంటుందని ఆరోపించారు. జగనన్న కాలనీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి బస్సు యాత్రకు సెక్షన్ 30, 144 వర్తించవా అని ప్రశ్నించారు. బస్సు యాత్రతో వస్తున్న వైసిపి నాయకులను, జగన్ దోపిడీపై ప్రజలు ప్రశ్నించాలన్నారు.

సమస్యల సత్వర, శాశ్వత పరిష్కారమే లక్ష్యం

ములగాడలో 'జగనన్నకు చెబుదాం'లో జెసి విశ్వనాథన్

వివిధ సమస్యలపై ప్రజల నుంచి 60 వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- ములగాడ : జగనన్నకు చెబుదాం వేదికగా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సకాలంలో, శాశ్వత పరిష్కారం చూపటమే అంతిమ లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. బుధవారం స్థానిక మరిడిమాంబ కల్యాణమండపంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాంలో జెసి విశ్వనాథన్‌తో పాటు జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ, ఇతర అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి రీ-సర్వే, భూ సరిహద్దులు, విస్తీర్ణం విభేదాలు, ఆక్రమణలు, జివిఎంసి పరిధిలోమౌలిక వసతుల కల్పన, డ్రైనేజీలు, కుళాయిలు, వీధిదీపాలు, తదితర సమస్యలపై 60 మంది నుంచి అర్జీలు స్వీకరించారు.



సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుధ, గ్రామ కమిటీ సభ్యులు

ఈ సందర్భంగా మల్కాపురం గ్రామ సమస్యలపై 61వవార్డు కార్పొరేటర్ కొణతాల సుధతోపాటు గ్రామ కమిటీ గౌరవాధ్యక్షుడు భోగవిల్లి నాగభూషణం, అధ్యక్షులు సత్యల మహేష్, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, కోశాధికారి పట్నాల పెంటరావు తదితరులు జెసికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జెసి విశ్వనాథన్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ఒకటికి రెండు సార్లు అధ్యయనం చేసి, రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రెండు అంతకంటే ఎక్కువ శాఖలకు సంబంధించిన సమస్యలైతే ఆయా శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, అర్జీదారునికి సంతృప్తికరంగా ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలన్నారు. స్పందనలో ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్పందనకు వచ్చే అర్జీదారులు ఇబ్బందులు పడకుండా అవసరమైన ఏర్పాట్లను వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ ఆధ్వర్యంలో వైసిపి నేతలు చేపట్టారు.

డిసెంబర్ 18 నాటికి

ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి



మాట్లాడుతున్న తహశీల్దార్ రామారావు

ప్రజాశక్తి -ఆనందపురం : డిసెంబర్ 18 నాటికి ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని బిఎల్‌ఒలకు తహశీల్దార్ లోకవరపు రామారావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బిఎల్‌ఒలు, ఎన్నికల అధికారులతో సమావేశంలో మాట్లాడుతూ పోలింగ్ కేంద్ర పరిధిలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శించి అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. ఓటర్ నమోదు, తొలగింపు ప్రక్రియలను ఈనెల 27 నుండి డిసెంబర్ 18 వరకు ఇంటింటికీ తిరిగి నమోదు చేయాలన్నారు. మండలంలో కొత్తగా 13 బిఎల్‌ఒలను నియమించినట్లు తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఒకే ఇంటినెంబర్‌పై అత్యధిక ఓటర్లనున్న నేపథ్యంలో వాటిని సరిచేయాల్సిన బాధ్యత బిఎల్‌ఒలపైనే ఉందన్నారు. ఓటర్ల సవరణ విధులను వాలంటీర్ల సహకారం తీసుకోవద్దని, అలా చేస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులౌతారని హెచ్చరించారు. ఫారం 7 నింపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భీమిలి తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

సిసి కెమెరాలతో సీక్రెట్ రికార్డింగ్!

ప్రభుత్వ స్థలంలో ప్రయివేటు వ్యక్తుల ఏర్పాటు

భయాందోళనకు గురౌతున్న కొండవాలు ప్రాంత మహిళలు

ప్రజాశక్తి- అనందపురం: అనువుగాని చోట, అదీ కొండవాలులోని ప్రభుత్వ స్థలంలో ప్రయివేటు వ్యక్తులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. కొండవాలు ప్రాంతంలోని నిరుపేద మహిళలు బహిర్భూమికి, ఇతరత్రా వ్యక్తిగత అవసరాలకు అటుగావెళ్లినపుడు సీక్రెట్‌గా రికార్డింగ్ చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ నేపథ్యంలో కొండపై సిసి కెమెరాల ఏర్పాటుపై అధికారులు, పోలీసులు దృష్టిపెట్టి వీటిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనాఉంది. మండలంలోని ఆనందపురం బాలికల వసతి గృహం సమీపంలో కొండ పక్కన ప్రభుత్వ భూమిలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు సీసీ కెమెరాలు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కొండపైన ఉండే ప్రభుత్వ స్థలంలో కెమెరాలు పెట్టి, అక్కడి చర్యలను నిత్యం పర్యవేక్షిస్తున్నారని, ముఖ్యంగా మహిళలను టార్గెట్ చేసి, కొండప్రాంతంలో బహిర్భూమి, కాలకృత్యాలకు మహిళలు వెళ్లే దారిలో వీటిని అమర్చడంలో ఆంతర్యమేమిటని స్థానికులు మళ్లగుల్లాలు పడుతున్నారు. ఇక్కడ సిసి కెమెరాలను ఏర్పాటుచేసి, దృశ్యాలను రికార్డుచేయడమో, లేకుంటే పర్యవేక్షిస్తున్నారో తెలియనిస్థితిలో స్థానిక మహిళలు యథావిధిగా తమ కార్యకలాపాలను కొనసాగించారని,, ఇపుడు ఏం జరుగుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు దీనిపై దృష్టి పెట్టి, స్థానిక ప్రజల భయాందోళనలు, సందేహాలను నివృత్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కొండపై ప్రభుత్వ స్థలంలోతాత్కాలికంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరా

స్క్రాప్ షాపులతో పెరుగుతోన్న చోరీలు!

గాజువాక ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా పాత సామాన్ల దుకాణాలు ... పట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -గాజువాక : పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో పాత సామాన్ల దుకాణాలు (స్క్రాప్ షాపులు) ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. దీంతోపాటు చోరీల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం మూసేసిన వారే మళీ స్క్రాప్ షాపులను ఎక్కడికక్కడే తెరుస్తున్నారు. గాజువాకలో ఇష్టారాజ్యంగా పాత సామాన్ల దుకాణాలు వెలుస్తున్నా సంబంధిత అధికారులు, ముఖ్యంగా పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గాజువాక పరిసరాలతోపాటు ఇతర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడడం, సంబంధిత వస్తువులను పాత సామాన్లు దుకాణంలో విక్రయించడం పరిపాటిగా మారిందని పలువురు అంటున్నారు. గడచిన నెలలో గాజువాక పరిధిలో చాలా చోరీలు జరిగినా, నేరనియంత్రణలో గాజువాక పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ముఖ్యంగా వీటికి కారణమైన వాటిపై చర్యలు చేపట్టడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

ములగాడ హౌసింగ్ కాలనీలో భారీ చోరీ జరిగింది. ఈ కేసుకు సంబంధించి ఇంతవరకు రికవరీ, పురోగతి లేదు. అదేవిధంగా శ్రీనగర్లో మరో చోరీ జరిగినా, దానికి సంబంధించి కేసు నమోదు చేయలేదు. ఇటీవల నడుపూరు గ్రామంలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. గాజువాక హైస్కూల్ రోడ్డు, పెంటయ్య నగర్ వంటి ప్రాంతాల్లో నివసిస్తున్న కొండవాలు ప్రాంత ప్రజలు ద్విచక్ర వాహనాలు పైకి తీసుకెళ్లడం సాధ్యం కాని పరిస్థితుల్లో కిందనే పార్కింగ్ చేస్తారు. అలా పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్, ఇతర వస్తువులు చోరీకి పాల్పడుతున్నారు. ఈ విధంగా గాజువాక ప్రాంతంలో చోరీల రేటు గణనీయంగానే ఉన్నప్పటికీ, వీటిల్లో కొన్ని కేసులు పోలీస్ స్టేషన్ వరకు వస్తుండగా, కొన్ని కేసుల వరకు వచ్చ పరిస్థితి లేదు. పగటిపూట రెక్కీ నిర్వహించడం, రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడడం, ఆలాగే బైకుల్లోని పెట్రోలు, ఇతర చిల్లర దొంగతనాలు యథేచ్ఛగా జరుగుతున్నా పలు ప్రాంతాల్లో సరైన పోలీసుల గస్తీ నేటికీ లేదని స్థానికులు అంటున్నారు.

గాజువాక ప్రాంతంలో చోరీలు పెరగడానికి ఒకవిధంగా స్క్రాప్ దుకాణాలు కారణమన్న విమర్శలూ ఉన్నాయి. ఇటీవల కాలంలో బిసి.రోడ్డుతోపాటు జగ్గు సెంటర్, గంగవరం పోర్ట్ రోడ్డు, శ్రీనగర్ రోడ్‌ఇలా ఎక్కడికక్కడే విపరీతంగా స్క్రాప్ దుకాణాలు వెలిసాయి. గతంలో నగర పోలీస్‌కమిషనర్‌గా సాంబశివరావు ఉన్నపుడు పాత సామాన్ల దుకాణాలన్నింటినీ దాదాపు మూయించేశారు. అలాగే గాజువాక ప్రాంతంలో పోలీసుల గస్తీ, భద్రత కూడా పటిష్టంగా ఉండేదని, దీంతో చోరీలకు అస్కారం లేకుండా పోయిందని అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులతోపాటు సంబంధిత అధికారులు చొరవ తీసుకుని స్క్రాప్ దుకాణాలను నియంత్రించంతోపాటు చోరీలపై పటిష్టనిఘా పెట్టాలని కోరుతున్నారు.

క్రైం సిఐ వివరణ

దీనిపై గాజువాక క్రైం సిఐ ఎఫ్.సూర్యనారాయణ వివరణ కోరగా, పలు చోరీ కేసుల్లో నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేశామని, చోరీ సొత్తును కూడా రికవరీ చేస్తున్నట్లు వెల్లడించారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సీతమ్మధార : గుర్తుతెలియని వ్యక్తి మరణంపై నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. వివరాలివి.నగరంలోని అక్కయ్యపాలెం శ్రీనివాస్‌నగర్ వినాయకుడి గుడివద్ద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న నాలుగో పట్టణ పోలీసులు, అంబులెన్స్ సాయంతో బాధితుడిని కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు.మృతుని వయస్సు 55ఏళ్లు ఉంటుందని, మరిన్ని వివరాలకు పోలీస్‌స్టేషన్ సంప్రదించాలని పోలీసులు సూచించారు.

పాడిరైతులకు పాల క్యాన్ల పంపిణీ



పాల క్యాన్లను పంపిణీ చేస్తున్న పెదిరినాయుడు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అనంతవరంలోని విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రంలోని సభ్య పాడిరైతులకు పాల సంఘం అధ్యక్షులు గొర్రిపాటి పెదిరినాయుడు తన సొంత నిధులతో 150 మందికి పాలక్యాన్లను పంపిణీ చేశారు. పాడి రైతులకు దసరా పండుగ కానుకగా నాలుగు లీటర్ల పాలక్యాన్లను పాలసంఘం భవనంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులు నాణ్యమైన పాలను తీసుకొచ్చి అధిక ధరను పొందాలని సూచించారు.

శారదా పీఠాన్ని సందర్శించిన రామ్‌విలాస్ వేదాంతి

ప్రజాశక్తి- పెందుర్తి : రామజన్మభూమి ట్రస్ట్ సభ్యులు, వశిష్ట పీఠాధీశ్వరులు, మాజీ ఎంపీ రామ్‌విలాస్ వేదాంతి బుధవారం విశాఖ శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల ఆలయంలో పూజలు చేసారు. దేవతామూర్తుల ఆలయాలను దర్శించారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసారు. ఇటీవల కురుక్షేత్రలో విశాఖ శారదాపీఠం నిర్వహించిన శతసహస్ర ఛండీ పారాయణ గురించి తెలిసి పీఠాధిపతులను అభినందించారు. అయోధ్యలో రామజన్మభూమి ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విశాఖ శారదాపీఠం ఆశ్రమాన్ని అయోధ్యలో ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు.

నీతి ఆయోగ్ ఎబిఎఫ్‌గా వినీల

ఎయు పరిశోధక విద్యార్థిని ఎంపికపై విసి హర్షం

ప్రజాశక్తి- విశాఖపట్నం : భారత ప్రభుత్వ నీతిఆయోగ్ ఏస్పిరేషనల్ బ్లాక్ ఫెలో (ఎబిఎఫ్)గా ఎయు బయోకెమిస్ట్రీ విభాగం పరిశోధకురాలు బాతా హెప్సిబా వినీల ఎంపికయ్యారు. ఆ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు ఆమెకు అందాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై.రామవరం మండలానికి ఏస్పిరేషనల్ బ్లాక్స్ ఫెలోగా వినీల సేవలందిస్తారు. ఈ సందర్భంగా వినీలను ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

ఏస్పిరేషనల్ బ్లాక్ ఫెలోగా ఎంపికైన వినీలకు నెలకు రూ.55 వేలు స్టైఫండ్‌గా కేంద్ర ప్రభుత్వం అందించనుంది. తమకు కేటాయించిన మండలం సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలు చేసేలా చూడడం వీరి బాధ్యత. దేశవ్యాప్తంగా 500 ఏస్పిరేషనల్ బ్లాక్‌లుగా ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో 15 బ్లాక్‌లు ఎంపికయ్యాయి.

ఎబిఎఫ్‌లు తమకు కేటాయించిన ప్రాంతంలో స్థానిక ప్రజలకు వర్క్‌షాప్‌లు, సదస్సులు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పిస్తారు. వై.రామవరం మండలంలో విభిన్న గ్రామాలలో స్థానిక సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను చూపే దిశగా ఎబిఎఫ్ వినీల పనిచేస్తారు. ఆయా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా సమకూరుస్తుంది. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులో ఎయు పరిశోధక విద్యార్థిని వినీల ఎంపిక కావడంపై విసి ఆచార్య ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేసారు.

ఎల్‌జి పాలిమర్స్ బాధితులను ఆదుకోవడంలో వైసిపి సర్కారు విఫలం

- జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు
- బాధిత గ్రామాల్లో సిపిఎం బృందం సందర్శన



వెంకటాపురంలో మాట్లాడుతున్న సిపిఎం నేత గంగారావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన జరిగి మూడున్నరేళ్ళ గడిచినా, బాధిత కుటుంబాలను ఆదుకోవడంలోనూ, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సిపిఎం నేత, జివిఎంసిలో పార్టీ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు ఘాటుగా విమర్శించారు. బుధవారం పాలిమర్స్ చుట్టుపక్కల గ్రామాల్లో సిపిఎంనేతల బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిమర్స్ విడుదల చేసిన విషవాయువులు వలన పలువురు ప్రాణాలను కోల్పోవడంతోపాటు అనేక మంది అనారోగ్యం బారిన పడ్డారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని గ్రామ ప్రజలు ఫ్లెక్సీలు పెడితే, స్థానిక వైసిపి నేతలు పోలీసుల సహకారంతో వాటిని తొలగించడం దుర్మార్గమన్నారు. వైసిపి సమావేశానికి వెళ్లలేదని ఇద్దరు వాలంటీర్లను తొలగించారని మండిపడ్డారు. పాలిమర్స్ దుర్ఘటన తర్వాత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన అధికారపార్టీ నేతలు, నేటికీ దానిని నెరవేర్చలేదన్నారు. ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన తర్వాత 370 మంది సొసైటీ కార్మికులను తొలగించిన యాజమాన్యం, వారికి ఆరు నెలల జీతాలు చెల్లించి తరువాత చేతులెత్తేసిందన్నారు. వీరిని ఎల్‌జి పాలిమర్స్ సంస్థలోనే కొనసాగించేలా చర్యలు చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలులో మాత్రం గాలికొదిలేసిందని విమర్శించారు. ఎల్‌జి పాలిమర్స్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి చీకటి ఒప్పందం జరిగిందని, అందుకే బాధితులను ఆదుకోవడంలోనూ, ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నా పట్టించుకునే దిక్కులేదని గంగారావు మర్రులు గుప్పించారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, పాలిమర్స్ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. లేని పక్షంలో ప్రజాక్షేత్రంలో విస్తృత ప్రచారం చేసి, వైసిపి పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని హెచ్చరించారు. హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తున్న వైసిపికి రానున్న ఎన్నికల్లో భంగపాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బలివాడ వెంకటరావు, ఉరుకూటి రాజు పాల్గొన్నారు

బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబానికి బీమా సాయం అందజేస్తున్న కొండబాబు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన జివిఎంసి నాలుగో వార్డు నిడిగట్టు సచివాలయం పరిధి నేరెళ్ళ వలస గ్రామానికి చెందిన వి నరసింహరాజు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ 10 వేలను వార్డు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు బుధవారం అందజేశారు. ప్రమాద మరణం కావడంతో బాధిత కుటుంబానికి రూ. ఐదు లక్షల బీమా పరిహారం అందుతుందని, అందులో తక్షణసాయం రూ.పది వేలు పోను మిగతా రూ.4.90లక్షల మొత్తాన్ని నామినీ పేరిట బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జె శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీ రాజు పాల్గొన్నారు

28న సామాజిక సాధికార సభ



బస్సు యాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 28న చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో తలపెట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర సభను జయప్రదం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ తరగతుల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు వివరించారు. ఓ వైపు మంత్రి వర్గంలోను, మరో వైపు నామినేటెడ్ పదవుల కేటాయింపు లోను ఆయా తరగతులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.నేను అనే నినాదం కంటే మనం అనే నినాదం తో మనమంతా కలిసి పని చేస్తే 2024 ఎన్నికల్లో విజయం వైసిపిదేనని స్పష్టం చేశారు ఈ సమావేశంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన ఆనంద్ క్లబ్ విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 21 ,22 తేదీలలో ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదవ ఇంటర్‌స్టేట్స్ ఇన్విటేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ -2023 పోటీలలో మధురవాడ ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

బాలుర 41 కేజీల విభాగంలో ఎస్ నిఖిల్ బంగారు పతకం, 57 కేజీల విభాగంలో పి వెంకటేష్ బంగారు పతకం అలాగే బాలికల విభాగంలో ద్వితీయ శ్రేణి లో నిలిచి అండర్ 47 కేజీల విభాగంలో ఏ .పవిత్ర రజతపతకం, అండర్ 51 కేజీల విభాగంలో పి.భార్గవి రజత పతకం సాధించారు. విజేతలకు అడిషనల్ ఎస్‌పి (శాంతిభద్రతలు) జె.కులశేఖర్, అదనపు ఎస్‌పి (అడ్మినిస్ట్రేషన్) జె వెంకటరావు, ఏపి అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి గ్రాండ్ మాస్టర్ కె.బాబురావు, అధ్యక్షులు వి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.విజేతలకు శిక్షణ ఇచ్చిన కోచ్ ఆనంద్ ను పలువురు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎడిసిపి శ్రీనివాస్

ప్రజాశక్తి -ములగాడ : ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన అవసరమని ఎడిసిపి శ్రీనివాస్ ఎసిపి రాజ్‌కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మల్కాపురం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మరిడిమాంబ కళ్యాణమండపంలో బుధవారం వర్తకులు, చిరువ్యాపారస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. ప్రజల సహకారంతో ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమారాణి, పొట్టిమూర్తి, ధనలత, నూకరెడ్డి, రామ్మోహన్ నాయుడు, స్థానిక నాయకులతోపాటు రోడ్డు పక్కన ఉండే దుకాణదారులు, తోపుడు బళ్ల వ్యాపారులు, వివిధ రకాల వర్తకులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- పద్మనాభం : స్థానిక బిసి బాలుర హాస్టల్ సమీపంలో మాతా గోవిందమాంబ సమేత మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి పద్మనాభం విరాట్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఓంకారాచార్య ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ ఆలయాన్ని గ్రామస్తులు, భక్తులు సహకారంతో రూ.15 లక్షల అంచనాతో నిర్మించనున్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కె. లక్ష్మణరావు, బి సన్యాసినాయుడు, కృష్ణాపురం ఎంపిటిసి కె.లక్ష్మి ఎర్రినాయుడు, ఎంవి.రమణ, సంఘ ప్రతినిధులు ఎ.వెంకటాచారి, త్రినాద్, శ్రీను, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి -భీమునిపట్నం : అనుమానితుల సంచారంపై పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని స్థానిక నేర విభాగం ఎస్ఐ ఎస్ సూర్య ప్రకాశరావు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులకు, వాలంటీర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేరస్తులను, చెడు అలవాట్లకు బానిసైన వారిని ఎలా గుర్తించవచ్చో వివరించారు. నేరనియంత్రణలో ప్రజలను భాగస్వామ్యం చేసి వారి సహకారం తీసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్ల నిర్మాణం
- మూణ్నాళ్లకే పాడౌతున్న పనులు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్మార్ట్‌సిటీ విశాఖలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విశాఖ పాలనా రాజధాని పేరుతో అధికార పార్టీ చేస్తున్న ఆర్భాటానికి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న పనులకు ఎక్కడా పొంతన లేదనే ఆరోపణలూ ఉన్నాయి. ప్రజల నుంచి వసూలు చేసిన లక్షలాది రుపాయల విలువైన పనులు అధికారుల పర్యవేక్షణాలోపంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేయడం వల్ల మూణ్నాళ్ల ముచ్చటగా మారిపోనున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. జివిఎంసి 26వ వార్డులో కాలువలు, కల్వర్టు నిర్మాణాలు ఇందుకు నిదర్శమని ఆరోపిస్తున్నారు.

26వ వార్డులో పలు ప్రాంతాల్లో కల్వర్టులు, డ్రైనేజీ నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన అధికారపార్టీ నేతలుగానీ, సంబంధిత అధికారులుగానీ పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని అంటున్నారు. లలితానగర్ వెనక రోడ్డులో కల్వర్టు నిర్మాణం అపుడే పాడై పోయిందని,దేవిధంగా వివేకానంద హాస్పిటల్ ఎదురుగా నిర్మాణం చేపట్టిన కల్వర్టు అపుడే పెచ్చులు ఊడిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు మండిపడుతున్నారు. కల్వర్టు నిర్మించిన తర్వాత కనీసం వాటరింగ్ చేయకపోవడం, అలాగే డ్రైనేజీల నుంచి మురుగునీటిని వెంటనే వదిలేయడంతో కిందభాగం పూర్తిగా పాడైపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ప్రజాధనంతో పదికాలలపాటు ఉండాలని చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఇంత నిర్లక్ష్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సక్రమ పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వివరణ, స్పందన తెలియాల్సి ఉంది.



పైపైనే ప్లాస్టింగ్‌లతో నాసిరకంగా చేపట్టిన కాలువల నిర్మాణ పనులు

వరి పంటలో కేలీలు

◆ దిగుబడిపై తీవ్ర ప్రభావం
◆ ఆర్‌బికె ద్వారా సరఫరా చేసిన విత్తనాల్లో కల్తీ
◆ లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి-చోడవరం

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో వరి పంటలో ఎక్కువగా కేలీలు కనబడుతున్నాయి. పంట దిగుబడిపై వీటి ప్రభావం అధికంగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ కల్తీ విత్తనాలు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసినవి కావడం విశేషం. రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై విత్తనాలు సరఫరాకు ముందుగా రైతులను డబ్బులు కట్టించుకొని సరఫరా చేశారు. ఇలా రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై అందించిన వరి విత్తనాలలో విత్తనం కల్తీ అయి పంట దశకు వచ్చే సమయానికి అధికంగా కేలీలు కనబడుతున్నాయి.



కేలీలు వచ్చిన వరి చేను

చోడవరం, బుచ్చయ్యపేట మండలాల్లోని అధికంగా ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా చేసిన ఆర్‌జిఎల్ విత్తనాలలో ఎక్కువగా కేలీలు కనబడుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు రైతులకు ఆలస్యంగా అందించారు. ఇవి 50 శాతానికి పైగా మొలకెత్తకుండా పోయాయి. ముందుగా సరఫరా చేసిన విత్తనాల్లో కల్తీ ఉండడంతో కేలీలు కనబడుతున్నాయి. వీటి వల్ల పంట చేతికి వచ్చే సమయానికి 30శాతం దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రాయితీ ద్వారా అందించే విత్తనాల్లోనే కల్తీ జరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎకరాకు రూ.30వేలు వరకు పెట్టుబడి పెట్టి సాగు చేయగా, పంట పక్వానికి వచ్చే సమయానికి కేలీలు ఉండడం ఆందోళన కలిగిస్తుందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు తక్షణమే పొలాలను పరిశీలించి పంట నమోదు చేసి, అందుకు తగ్గ నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

కళ్లకు గంతలు కట్టుకొని టిడిపి నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆధ్వర్యాన కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకొని స్థానిక ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డు ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. దీనికి ముందు టిడిపి కార్యాలయం ఊరేగింపుగా మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ జగన్ రెడ్డి దుష్ట పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందని, జగన్ నిరంకుశ సంకెళ్ళ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన ప్రవీణ్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించానికి నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలనే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సైకో జగన్ రెడ్డి పాలన పోవాలన్నారు. ఎన్నాళ్ళు పోలీసులను అడ్డం పెట్టుకొని పాలన చేస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మాధంశెట్టి నీలబాబు, బొలిశెట్టి శ్రీనివాసరావు, బోడి వెంకటరావు, ధనాల విష్ణు చౌదరి, బొడ్డేడ మురళి, గుడాల సత్యనారాయణ, పూడి త్రినాధ్, మల్ల గణేష్, కుప్పిలి జగన్, పెనుమత్స సాయిరాజు, వేగి వెంకటరావు, పొలిమేర నాయుడు, విల్లూరి రమణబాబు, బుద్ద భువనేశ్వర రావు, ఎర్రంశెట్టి వెంకట్, దాడి కోటి పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైన మండలంలోని కొరువాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులను జెడ్‌పిటిసి సభ్యులు ఈర్లె అనురాధ బుధవారం అభినందించారు. అండర్ 14 బాలికల విభాగంలో మాకవరపాలెం హైస్కూల్లో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో వనము గోవర్ధన్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అలాగే పాడేరు హైస్కూల్లో నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో వేచలపు మౌనిక, విశాఖపట్నంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో సిహెచ్ రామారావు తమ సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో జెడ్‌పిటిసి అనురాధ పాల్గొని అభినందనలు తెలిపారు. ఒకే హైస్కూల్ నుండి



విద్యార్థులను అభినందిస్తున్న జెడ్‌పిటిసి అనురాధ

ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కమల కుమారి, కొరువాడ ఎంపిటిసి సభ్యులు చీపురపల్లి అచ్చిబాబు, వెంకటరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందనలు

అచ్యుతాపురం : చిత్తూరు జిల్లా నగరిలో ఈ నెల 22, 23, 24 తేదీలలో జరిగిన 8వ ఆంధ్ర రాష్ట్ర స్థాయి జూనియర్ అండర్-19 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజేతలైన విశాఖ జిల్లా క్రీడాకారులను పలువురు అభినందించారు. క్రీడాకారులను అభినందించిన వారిలో విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ ఆర్ వెంకట్రావు, అధ్యక్షులు డిఆర్ ప్రభుజీ, ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శంకర్రావు, క్లబ్ ఛైర్మన్ ఆర్‌వివి నగేష్ తదితరులు ఉన్నారు.

అసమానతలు లేని అభివృద్ధికి బస్సు యాత్ర

ప్రజాశక్తి - ఎటపాక

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం బస్సు యాత్ర చేపట్టిందని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో జరిగే బస్సు యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. బస్సుయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలే ముఖ్యమైన ఎజెండాగా ప్రభుత్వ పాలన ఉండాలని సిపిఎం కోరుకుంటుందని చెప్పారు. ప్రజల పక్షాన ప్రతిపక్షాలు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, ఎటపాక మండలం కార్యదర్శి ఐ వెంకటేశ్వర్లు, నాయకులు ఇరపా అజయ్ కుమార్, తాటి అశోక్ పాల్గొన్నారు.

నేటి నుండి ఆర్‌బికెల్లో ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలు

ప్రజాశక్తి- సబ్బవరం

రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలు ఈ నెల 26 నుండి 29 వరకు అందుబాటులో ఉంచుతున్నట్లు మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్లో అన్ని గ్రామ పంచాయతీల్లో అన్ని పంటలకు ఈ-క్రాప్ పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి రైతులు వేసిన పంట వివరాలన్నీ ఈ నెల 26 నుండి 29వ తేదీ వరకు ఈ క్రాపు ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ కోసం అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందని చెప్పారు. దీనిపై గ్రామ సభలు కూడా నిర్వహించబడతాయని, కావున పంటలు సాగు చేసిన రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే సవరణ కొరకు తమ రైతు భరోసా కేంద్రంలో ఉన్న వివిఎ /విహెచ్ఎలను సంప్రదించి అభ్యంతరములను రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. తుది జాబితాలు ప్రదర్శించిన పిమ్మట ఎటువంటి మార్పులు చేయబడవని తెలిపారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని వెదురువాడ సచివాలయం పరిధి వైయస్సార్ నగర్ కాలనీలో బుధవారం పలు అభివృద్ధి పనులను ఎలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిన్ రోడ్ నుండి ధర్మారెడ్డి రాజు ఇంటి వరకు పది లక్షల రూపాయలతో నిర్మించిన కల్వర్టు, రోడ్డును, వైయస్సార్ నగర్ కాలనీలో మోల్డ్ టెక్ ప్యాకింగ్ లిమిటెడ్ ఆర్థిక సహాయం రూ.8,30,000తో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే వెదురువాడ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని, పౌష్టికాహారం స్టాల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ నగర్ పంచాయతీ సర్పంచ్ లాలం వాణి వాసు, మాజీ మండలాధ్యక్షులు చేకూరి శ్రీనివాసరాజు, వైసీపీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, ఎంపిటిసి సభ్యురాలు అల్లం లక్ష్మి, గొర్లి అశ్విని నూకరాజు, పి వాసురాజు తదితరులు పాల్గొన్నారు.



సురక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

ఆవ ఆయకట్టు భూముల్లో

ఎండిపోతున్న వరి పంట

- నీరున్నా విడుదల చేయని వైనం
- అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం

ప్రజాశక్తి అచ్యుతాపురం

సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో వరి పంట ఎండిపోతున్న వైనం మండలంలోని కొండకర్ల ఆవ ఆయకట్టు భూముల్లో చోటుచేసుకుంది. కొండకర్ల ఆవ నుండి ఆయకట్టు భూములకు సంబంధిత అధికారులు నీటిని వదలవలసి ఉంది. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో సాగునీరు లేక వరి పంట ఎదుగుదల లేక మరుగుజ్జులా ఉండిపోయింది. మండలంలోని తిమ్మరాజుపేట, పెదపాడు గ్రామాల్లోని భూములకు సాగునీరు సైతాన్ కాలువ ద్వారా విడుదల చేయాల్సి ఉంది. సైతాన్ కాలువ



నీరులేక ఎదగకుండా ఉన్న వరి పంట

ద్వారా నీరు విడుదల అవుతుందని ఆశతో ఆవ ఆయకట్టు భూముల్లో రైతులు వరినాట్లు అత్యధిక విస్తీర్ణంలో వేశారు. కొండకర్ల ఆవ గర్భంలో నీటి నిల్వ అధికంగా స్టోరేజ్ అయి ఉంది. అయినా కూడా సైతాన్ కాలువ ద్వారా నీటిని అధికారులు వదలకపోవడంతో ఈ ప్రాంత రైతులు నాటిన వరి పంటకు సాగునీటి సమస్య ఎదురైంది. సాగునీరు లేక, గొట్టపు బావులు లేక నాటిన వరి పంట నిలువునా ఎండిపోతుంది. నేల బీటలు వారింది. నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తిమ్మరాజుపేట సైతాన్ కాలువ ద్వారా కొండకర్ల ఆవలోని నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఆందోళన చేపడతామని, అవసరమైతే కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఆర్టీవో హేమ సుందర్ పేర్కొన్నారు. అనకాపల్లి మండలం దిబ్బపాలెం గ్రామంలో బుధవారం ఆర్టిఓ హేమ సుందర్ క్షేత్ర సందర్శన చేశారు. ప్రకృతి వ్యవసాయం నిర్వహించి ఏ గ్రేడ్ మోడల్ ఏటీఎం మోడల్ విజిట్ చేసి వి.లక్ష్మి, పూర్ణ, ఎం.వరలక్ష్మి ఖర్చు ఆదాయాలపై వివరించడం జరిగింది. ఈ ఏటీఎం మోడల్స్ పైన తమ ఇంటి ఖర్చుకు నిరంతరం ఆదాయంతో పాటు ఆరోగ్యకరమైన పంటను పండించుకుని తినడం ద్వారా లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. వెయ్యి లీటర్ల ద్రవ జీవామృతం ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఏ గ్రేడ్ వలన ప్రధాన పంట కయ్యే ఖర్చును గట్లపై వేసే పంటల ద్వారా సమకూర్చుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మరికొన్ని సూచనలు రైతులకు అందజేశారు. సిమెంటు తొట్టెలు ప్రతి మడి దగ్గర అమర్చమని తెలియజేశారు. కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ మెంటర్ అనిత, జానకి, మోడల్ మేకర్ వి శ్రీనివాసరావు, ఐసిఆర్పిలు స్వాతి పాల్గొన్నారు.

రేపు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమం ఈ నెల 27వ తేదీన మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు మండల తహశీల్దారు వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పందన కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, వివిధ శాఖల అధికారులు హాజరవుతారని వెల్లడించారు. మండల ప్రజలు తమ సమస్యలపై అధికారులకు ఈ స్పందనలో తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

పింఛనుదారుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకునాయుడు మృతి

ప్రజాశక్తి-చోడవరం : ఆంధ్రప్రదేశ్ పింఛన్‌దారుల సంఘం చోడవరం శాఖ మాజీ అధ్యక్షులు పిచ్చెట్టి వెంకునాయుడు బుధవారం మృతి చెందారు. 30 ఏళ్ల పాటు ట్రెజరీ ఉద్యోగిగా సేవలందించి వెంకునాయుడు, ఉద్యోగ విరమణ అనంతరం పింఛనుదారులకు తగు సలహాలు సూచనలు అందివ్వడానికి నిరంతరం కృషి చేశారు. గతంలో ఏపీ ఎన్జీవోస్ నాయకుడిగా పనిచేసి పలువురు ఉద్యోగుల మన్ననలు పొందారు. విశ్రాంత ఉద్యోగులకు ఆయన అనేక సేవలు అందించారు. వెంకునాయుడు మృతి పట్ల పట్టణంలో పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. .

శరవేగంగా నూకాలమ్మ నూతన ఆలయ నిర్మాణం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక నూకాంబిక అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. రాబోయే కొత్త అమావాస్య జాతర సమయానికి భక్తులకు అందించాలనే తపనతో మంత్రి గుడివాడ అమరనాధ్ సూచనలతో నూతన ఆలయనిర్మాణం వేగవంతం చేసినట్టు నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు తెలిపారు. ఇందులో భాగంగా ఎండోమెంట్ డిప్యూటీ ఇంజనీర్ కెవిసి.కృష్ణ, డిప్యూటీ స్థపతి జి.శ్రీనివాస ఆచార్య, అసిస్టెంట్ ఇంజనీర్ శివ పర్యవేక్షణలో మార్కింగ్ పూర్తి చేశామని చెప్పారు. పుట్టింగ్, బోటం కాంక్రీట్, గ్రౌండ్ లెవెల్ కాంక్రీట్ పునాదులు వారం రోజులు లోగా పూర్తి చేసి అమ్మవారి గర్భాలయం, అంతరాలయాలకు రాతి గోడలు నిలిపేందుకు సుగమం చేస్తామని తెలియజేశారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

విహార యాత్రలో విషాదం

- రైవాడ జలాశయంలో బోటు బోల్తా
- ఒకరు గల్లంతు

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని రైవాడ జలాశయంలో బుధవారం సాయంత్రం బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో జలాశయానికి విహారయాత్రకు స్నేహితులతో వచ్చిన సబ్బవరం మండలం బోలుసుపాలెం గ్రామానికి చెందిన రొంగలి సత్తిబాబు (38) గల్లంతయ్యాడు. తోటి స్నేహితులు తెలిపిన వివరాలు ప్రకారం... సబ్బవరంలో కళాసీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న రొంగలి సత్తిబాబు (38), గండిపోయిన నూకరాజు, చల్లా రాము, సేనాపతి అప్పలనాయుడు, గొంప శ్రీను, లెక్కల దొంగనాయుడు తదితరులు దసరా వేడుకల్లో భాగంగా ద్విచక్రవాహనాలపై బుధవారం రైవాడ జలాశయానికి సరదాగా గడపడానికి వచ్చారు. అందరూ కలిసి మధ్యాహ్నం భోజనాలు చేశారు. అందరితో సరదాగా గడిపిన సత్తిబాబు జలాశయం ఒడ్డున నిలిపి ఉన్న చేపల బోటులోకి ఎక్కి జలాశయంలోకి వెళ్లే ప్రయత్నం చేశాడు. ఈ ప్రయత్నంలో బోటు బోల్తా పడటంతో సత్తిబాబు జలాశయంలో మునిగిపోయాడు. తమతో అప్పటి వరకు సరదాగా గడిపిన సత్తిబాబు తమ కళ్ల ముందు మునిగిపోవడంతో మిగతా వారంతా అతని కోసం జలాశయంలో గాలించారు. వారి ప్రయత్నం ఫలించకపోవడంతో సాయంత్రం దేవరాపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.



రొంగలి సత్తిబాబు (ఫైల్‌ఫొటో)

గల్లంతైన సత్తిబాబుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్తిబాబు కుమారుడు భవానీ మాల వేశాడు. కుమారుడి దీక్ష పూర్తి కావడంతో తన భార్యని కుమారుడికి తోడిచ్చి బుధవారం ఉదయం విజయవాడ అమ్మవారి దర్శనానికి పంపించాడు. వారు అటు వెళ్లిన తరువాత తన సహచరులతో కలసి సరదాగా గడపటానికి రైవాడ జలశయానికి వచ్చిన సత్తిబాబు బోటు బోల్తా పడి గల్లంతయ్యాడు. దీంతో సత్తిబాబు కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఘాటెక్కుతున్న ఉల్లి ధరలు



ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ఉల్లిపాయ ధరలు ఘాటెక్కుతున్నాయి. కొద్ది రోజుల వరకు కిలో రూ.20 ఉన్న ఉల్లి ధర నేడు రూ.50కు చేరుకుంది. దీంతో ఉల్లిపాయలు కొయ్యి కుండానే వినియోగదారుల కళ్లలో నీళ్లు వస్తున్నాయి. గతంలో టమోటా కిలో రూ.250 వరకు వెళ్లింది. ఇటీవలే దాని ధరలు తగ్గి సామాన్యునికి అందులో అందుబాటులోకి వచ్చాయనుకుంటున్న సమయంలో ఉల్లి ధరలు పెరిగాయి. ఉల్లి ఉత్పత్తి అధికంగా జరిగే కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి తదితర ప్రాంతాల్లో వర్షాలు అధికంగా పడడంతో ఉల్లి ఉత్పత్తి తగ్గిపోవడంతో ఉల్లి ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో హోల్ సేల్ మార్కెట్‌కు సైతం ఉల్లిపాయలు తక్కువగా వస్తున్నట్లు తెలిపారు. హోల్ సేల్‌లో కిలో రూ.40 నుండి రూ.45 వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు అంటున్నారు. రవాణ తదితర ఛార్జీలను కలుపుకొని కిలో 50 రూపాయల వరకు విక్రయిస్తున్నట్లు వడ్డాదికి చెందిన ఓ వ్యాపారి తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో ఉల్లిపాయలు అధికంగా ఉత్పత్తి అవ్వడంతో కిలో పది రూపాయలు కూడా అమ్మినట్లు చెప్పారు. ఈ ఏడాది ఉల్లి ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు.

నేడు వైసిపి ముఖ్య కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలోని రైవాడ అతిథి గృహం వద్ద వైసిపి ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు బూరె బాబురావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

కామాక్షి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ దంపతులు

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి గవరపాలెం నిదానం దొడ్డి వద్ద ఉన్న కామాక్షి దేవి అమ్మవారి ఆలయాన్ని బుధవారం అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు దర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఎంపీ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షులు మత్తుర్తి గంగారావు, వైస్ చైర్మన్ శొంఠ్యాన సతీష్, కోశాధికారి తణుకు రవి, పట్టణ సంఘం అధ్యక్షులు కోటిపల్లి జేజిబాబు, కార్యదర్శి కొమ్మోజి రాజు, కోశాధికారి పొన్నాడ వెంకట నర్సింహఆచారి పెదబాబు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ దంపతులు

డిఆర్ కార్యాలయంలో పాము కలకలం

ప్రజాశక్తి-ఎలమంచిలి

యలమంచిలి డిఆర్ ఆఫీసులో పాము కలకలం రేపింది. ఉదయం 10 గంటలకు రికార్డ్స్ రూమ్‌లోకి దూరిపోయింది. దీంతో డీఆర్ ఆఫీస్ సిబ్బంది భయంతో పరుగులు తీశారు. సాయంత్రం వరకు పాము బయటకు రాకపోయేసరికి గాజువాక నుంచి పాములు పట్టే సిబ్బందిని రప్పించారు. పాము రికార్డ్స్ రూమ్‌లో ఉండడంతో ఉదయం నుంచి పనులు జరగలేదు. ఇలా తరచూ జరుగుతుండడంతో సిబ్బంది భయకంపితులవుతున్నారు.



పాము వెళ్లిన రికార్డుల రూమ్ ఇదే..

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవాలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

విజయ దశమి, శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాలను, గటాలను ఊరేగించారు.

అనకాపల్లి : మండలంలోని కొత్తూరు మేజర్ పంచాయతీలో బుధవారం శ్రీ కనకదుర్గమ్మ ఘటాలను, అమ్మవారి పల్లకిని 500 మంది మహిళలు, భవాని భక్తులతో కలసి బుధవారం మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ మోశారు. ముందుగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పీలా గోవింద సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామ రామాలయంలో నెలకొల్పిన దుర్గాదేవి అమ్మవారి ప్రతిమను బుధవారం గ్రామపురవీధులలో ఊరేగించారు అనంతరం అమ్మవారిని ఆవ కాలువలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారి వేషధారణలో ఘటనలు పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు.



కశింకోట ఉత్సవంలో పాల్గొన్న భవానీలు

కశింకోట : కశింకోట గౌరీ పరమేశ్వరుడి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గా దేవి విగ్రహం నిమజ్జనం బుధవారం ఘనంగా జరిగింది. భవానీలు ఉరేగింపు నిర్వహించి సమీపంలోని శారదా నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి వేగి గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని రావులమ్మపాలెంలో గ్రామంలో దుర్గాదేవి విగ్రహాన్ని అనకాపల్లి జిల్లా విఆర్‌ఓ సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాధ రామకాసు దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సబ్బవరపు నరసింహమూర్తి, సబ్బవరపు సూర్యనారాయణ, జక్కాన శ్రీరామ్‌మూర్తి, సబ్బవరపు దేవుడు బాబు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : విజయ దశమి పండుగను పురస్కరించుకొని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల దుర్గా మల్లేశ్వర అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గా దేవి మాత విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో పూలతో అలంకరించి పట్టణ పురవీధుల్లో బుధవారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహాన్ని బుధవారం గ్రామంలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. నవరాత్రులలో నిత్యం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్న సమరాధనకి భక్తులు తరలి వచ్చారు.

గొలుగొండ : విజయదశమి పండుగను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో కనకదుర్గమ్మ ప్రతిమలను ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. మేజర్ పంచాయితీ ఏఎల్ పురం గ్రామంలో స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద అర్చకులు వెలిది భద్రాద్రి రాముడు ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగించారు.

'జగనన్నకు చెబుదాం'తో ప్రయోజనం ఏదీ?

-ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని సమస్యలు

ప్రజాశక్తి-కోటవురట్ల:జగనన్నకు చెబుదాం 'స్పందన' కార్యక్రమానికి ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యంగానే మారింది. మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం జరగకపోవడం పట్ల పలువురు పలు సంఘాల నాయకులు, ప్రజలు పెదవి విరుస్తున్నారు, వాస్తవానికి జటిలమైన వ్యక్తిగత సమస్యలు తీర్చకపోయినా కనీసం ప్రజా సమస్యలు అయినా అధికారులు తీరుస్తారని ఆశించిన ఫిర్యాదుదార్లకు నిరాశ ఎదురైంది. మండల పరిషత్ కార్యాలయం వద్ద చెరువును తలపించే విధంగా రహదారిపై వర్షపు నీరు నిలువ ఉండిపోవడంతో పలువురు తీవ్ర అవస్థలు పడుతున్నారని జగనన్నకు చెబుదాం లో ఫిర్యాదు చేసినా ఏ అధికారి కూడా పట్టించుకోలేదని గ్రామానికి చెందిన పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై నీరు నిలవ ఉండి పోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, స్థానికులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులపై వాహనాల రాకపోకల కారణంగా నీరు తూలడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అదేవిధంగా మరో ప్రధాన సమస్య జల్లూరు వంతెన నిర్మాణానికి పలువురు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. వ్యక్తిగత సమస్యలు తీర్చకపోయినా ప్రజా సమస్యలు పట్టించుకుంటారనే నమ్మకంతో జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తీవ్ర అసంతృప్తి అసహనం వ్యక్తం చేస్తున్నారు అధికారులు ఇప్పటికైనా స్పందించి కనీసం ప్రజా సమస్యలు పరిష్కరించాలని పలు సంఘాల నాయకులు కోరారు.



మండల పరిషత్ కార్యాలయం వద్ద రోడ్డుపై నీరు (ఫైల్ ఫొటో)

అధికారులు పట్టించుకోలేదు

ప్రధాన రహదారిపై చెరువులు తలపిస్తూ నీరు నిల్వ ఉండడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. జగనన్నకు చెబుదాంలో చెప్పినా ఇంతవరకు పరిష్కారం కాలేదు..



దేవిడ్‌రాజు,
సిపిఎం నాయకులు

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు వైద్యం



రోలుగుంటలో మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-రోలుగుంట:సీఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో మేలు చేకూరుస్తుందని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని కొండపాలెం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధర్మశ్రీ మాట్లాడుతూ, ప్రజలకు 18 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు వివరించారు. పంచాయితీ నలుమూలల నుండి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బంటు బాబులు, కొమరవోలు సీనియర్ నాయకులు పిల్లా నూకరాజు, ఎంఇఒ పి.జగ్గారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ :జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి గజ్జలపు మణికుమారి కోరారు. ఏటిగైరంపేట పంచాయతీలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామస్తులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, పుత్తడి గైరంపేట సర్పంచ్ పత్తి రమణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, గుండుపాల సర్పంచ్ జోగా రామకృష్ణ, గుడివాడ సత్తిబాబు పాల్గొన్నారు.

యస్.రాయవరం:ప్రజా రోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుందని పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే గొల్ల బాబురావు తెలిపారు. కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్రమూర్తి, కొరుప్రోలు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు చేకూరి శ్రీరామచంద్రరాజులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రి సూరివేణి, ఉపసర్పంచ్ కొరపాటి గోపాలం, కార్యదర్శి రామలక్ష్మి, వీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

కోటవురట్ల:మండలంలో బుధవారం కొడవటిపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు స్థానిక సర్పంచ్ అప్పారావు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి దాదాపు 300 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన మిల్లెట్స్ వంటకాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని కూండ్రం గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సేనాపతి పెంటరావు, ఎంపీడీవో నరసింహారావు, ఈఓపిఆర్డి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఏయస్ పేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సర్పంచ్ మలసాల ధనమ్మ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, వైసిపి నాయకులు మలసాల కిషోర్, డాక్టర్ రమేష్, ఎంపిడిఒ రవికుమార్ పాల్గొన్నారు.

చోడవరం : మండలంలో బుధవారం వెంకన్నపాలెం వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సందర్శించారు. ఈ శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైసిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు బండారు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవ సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామసుందర్, నాయకులు స్వామి నాయుడు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కొమలపూడి గ్రామ సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదల సత్యనారాయణ పాల్గొన్నారు

దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కర్రి సత్యం సందర్శించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పండూరి సర్వునాయుడు, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, దేవరాపల్లి వేచలం పిహెచ్సి వైద్యాధికారులు పూజ్య మేఘన, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 74వ వార్డు టిఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వపరంగా ఉచితంగా అందించే స్పెషలిస్ట్ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌సి పి.సింహాచలం. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింపాత్రుడు, ఎఎంహెచ్‌ఒ ఎస్.కిరణ్, డిఇ ఎంఆర్‌ఎస్.అప్పారావు, మణికుమార్ ఎఇలు శివ,ఎస్ వెంకటరావు, ఎన్‌వై నాయుడు, బొడ్డు గోవింద్ పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రజా ఆరోగ్య భద్రతే సిఎం జగన్మోహనరెడ్డి లక్ష్యమని వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు అన్నారు. బుధవారం దారి రామ్మూర్తి కల్యాణమండపంలో 42,43 వార్డుల ఆరోగ్యసురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఆరోగ్యసురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ జగదీశ్వరరావు, జివిఎంసి వైసిపి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, పి. ఉషశ్రీ, పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి రెండోవార్డు డెక్కతిపాలెంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో పలువురు రోగులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించారు.



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



సర్వే చేస్తున్న సిబ్బంది

భూ రీ సర్వే పున:ప్రారంభం

ప్రజాశక్తి-చీడికాడ:కొంతకాలంగా ఆగి పోయిన జగనన్న భూ రీ సర్వే తిరిగి ప్రారంభమైంది. గతంలో జగనన్న భూ సర్వే చీడికాడ మండల కేంద్రంలో ప్రారంభం జరిగినప్పటికీ కొంతకాలంగా ఆగి పోవడంతో చీడికాడ గ్రామంలో జగనన్నకు చెబుదాంకు రైతులు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి సర్వే తక్షణమే ప్రారంభించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న భూ రీ సర్వే తిరిగి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చలుగు సత్యనారాయణ, సర్వేయర్ సురేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దాస్

ప్రముఖ విప్లవ కవికి నివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక కృష్ణా పేలస్ లో (డియస్‌పి)దళిత సేవ పరివేక్షణ జిల్లా అధ్యక్షుడు యాదగిరి దాసు ఆధ్వర్యంలో దళిత విప్లవ కవి కలేకూరి ప్రసాద్‌కి బుదవారం నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దళిత మహాసభ కత్తి పద్మారావుతో పాటు పాల్గొని చుండూరు సంఘటనలో దళిత ఉద్యమాన్ని విస్తృతం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. సమాజంలోని అన్ని వర్గాల కోసం, విప్లవ రచయితగా ఉండి అనేక కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు మార్తి అప్పలరాజు, నర్సీపట్నం డివిజన్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు చిట్ల చలపతిరావు, డి కేసెస్ డివిజన్ అధ్యక్షులు నక్కపల్లి నూకరాజు,డి యస్ పి నాయకులు మల్లవరపు సతీష్, సప్పారపు వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ముత్యాలు, తదితరులు

దుస్తులు, సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలో అప్పలరాజు పురం గ్రామంలో శ్రీ లలితా దేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు నియోజకవర్గ టీడీపీ విభిన్న ప్రతిభా వంతుల విభాగం అధ్యక్షులు నడుపూరు ముత్యాలు బుధవారం వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు అందరూ సహాయం చేయాలని ఆయన కోరారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

ప్రజాశక్తి-కోటవురట్ల:వెంకటాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం సమయంలో గ్రామానికి చెందిన తమరాన రామ సత్యనారాయణ (36) అదే గ్రామానికి చెందిన యువతి (24)పై అత్యాచారయత్నంపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై నారాయణరావు తెలిపారు. నిందితునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సిపిఎం ప్రజా ప్రణాళిక విడుదల

-15న విజయవాడలో ప్రజారక్షణ భేరి
-1 నుంచి రాష్ట్ర బస్సుయాత్రలు
-3, 4 తేదీల్లో విశాఖలో...
-సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మద్దిలపాలెం పిఠాపురం కాలనీలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ప్రజా ప్రణాళికను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధికోసం సిపిఎం నవంబరు 15న విజయవాడ ఎంబి స్టేడియంలో లక్షలాది మందితో ప్రజా రక్షణ భేరి (భారీ బహిరంగ సభ) నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేలా వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి విధానాలుంటున్నాయన్నారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలను పీడించేలా ధరలు పెంచి భారాలు మోపుతున్నాయన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజల అజెండా, అసమానతలు లేని అభివృద్ధికోసం నవంబరు 1న రాష్ట్రంలో 3 ప్రాంతాల నుంచి రాష్ట్ర బస్సుయాత్రలను సిపిఎం చేపడుతున్నట్లు తెలిపారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి జంక్షన్‌కు నవంబర్ 3న సాయంత్రం చేరుకుంటుందని, 4న ఎన్ఎడి జంక్షన్, కంచరపాలెం మెట్టు, పూర్ణామార్కెట్, శ్రీహరిపురం, గాజువాక, కూర్మన్నపాలెం మీదుగా యాత్ర సాగుతుందని, సభలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, ఖాళీగా ఉన్న రెండున్నర లక్షల ఉద్యోగాలు భర్తీ, మూతపడిన పరిశ్రమలు తెరిపించడం, ధరలు అదుపుచేయడం, వంటగ్యాస్ ధర రూ.400లు, పెట్రోల్, డీజిల్ లీటరు రూ.60కే ఇవ్వడం, పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం, సామాజిక పెన్షన్ నెలకు రూ.5వేలు, ఇళ్లు లేనిపేదలకు నివాస గృహాలు ఏర్పాటు, మెగా డిఎస్సీ, నిరుద్యోగ భృతి రూ.5000, రైతులకు గిట్టుబాటు ధర, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్, కనీసవేతనం రూ.26వేలు, స్కీం వర్కర్లను ప్రభుత్వఉద్యోగులుగా గుర్తింపు, పేదలకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, మైనార్టీల హక్కుల పరిరక్షణ, రిజర్వేషన్లు అమలు, వృత్తిదారులు, వికలాంగులకు ఉపాధి భద్రత, మహిళలకు రక్షణ, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయింపు, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, విభజన హామీల అమలు వంటివాటితో కూడిన ప్రజాప్రణాళికను సిపిఎం ప్రజల ముందుంచుతుందని తెలిపారు. ఇది అమలు జరిగేందుకు సిపిఎంను బలపర్చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కస్పాండెంట్ విజయకుమారి

గాంధీ విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:స్థానిక భవిష్య ప్రైవేటు పాఠశాలలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని మాజీ మున్సిపల్ కౌన్సిలర్, తెలుగుదేశం పార్టీ నాయకులు జాలుమూరి జోగారావు చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భవిష్య పాఠశాల కరస్పాండెంట్ విజయ కుమారి మాట్లాడుతూ, గాంధీ ఆచరించిన అహింస, శాంతి సిద్ధాంతాలతో స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. పాఠశాలలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పడంతో గాంధీజీ పేర్కొన్న ఆదర్శాలను ఎప్పటికప్పుడు గుర్తు చేసుకున్నట్లవుతుందని తెలిపారు.



నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థులు

జోనల్ స్థాయి పోటీల్లో నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థుల రాణింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఒంగోలులో ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహించిన జోనల్ స్థాయి సిబిఎస్‌సి క్లస్టర్ 8 పోటీల్లో విశాఖపట్నంలోని నేవీ చిల్డ్రన్ స్కూల్ పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో అహనా రాఠీ బంగారు పతకం సాధించి జాతీయస్థాయికి చేరుకుంది. బాలుర ఫుట్‌బాల్ జట్టు (అండర్ 19) ఛాంపియన్‌గా నిలిచి నేషనల్స్‌కు అర్హత సాధించింది. 9వ తరగతికి చెందిన భవేష్‌ను ఉత్తమ గోల్‌కీపర్‌గా ప్రకటించారు. సిబిఎస్‌సి క్లస్టర్‌లలో బాలుర బాస్కెట్‌బాల్ జట్టు (19 ఏళ్లలోపు) క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది.



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ ఎంవివి

మృతుని కుటుంబానికి ఎంవివి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జివిఎంసి 19వ వార్డు పరిధి వాసవానిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బడే నూకరాజు (58) కుటుంబ సభ్యులను బుధవారం ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంవివి మాట్లాడుతూ, కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ వెంకటలక్ష్మి, దాస్, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, గ్రామపెద్దలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

నిరూపిస్తే రాజీనామా చేస్తా

జడ్‌పిటిసి రవణమ్మ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:తాను ఎవరి దగ్గరైనా లంచాలు తీసుకుని పని చేసినట్లు నిరూపణ చేస్తే పదవికి రాజీనామా చేస్తానని జడ్పిటిసి శుకల రవణమ్మ బుధవారం సాయంత్రం మీడియాకు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ, తాను ఎంపీపీ గా పని చేసినప్పుడు పెన్షన్లకు, అభివృద్ధి పనులకు లంచాలు తీసుకొని అక్రమాలకు పాల్పడినట్లు నర్సీపట్నం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి మామ సుర్ల సత్యనారాయణ ఒక కార్యక్రమంలో తనపై ఆరోపణలు చేశారన్నారు. తాను ఎవరి దగ్గరైనా రూపాయి లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే జడ్పిటిసి పదవికి రాజీనామా చేస్తానన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరాలలో మీరు చేసిన అభివద్ధి ని చూపించాలని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేశామని తెలిపారు. మొన్నటివరకూ సుర్ల సత్యనారాయణ అయ్యన్నపాత్రుడుతో ఉండి అయ్యన్నను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవణమ్మ

నక్కపల్లి ఎస్ఐగా విభూషణరావు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి నూతన ఎస్ఐగా విభూషణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తకోట పోలీస్ స్టేషన్ నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు. పోలీస్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎటువంటి తావు లేకుండా నిరంతరం నిఘా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.ఇప్పటివరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన శిరీష జిల్లా కేంద్రంకు బదిలీ అయ్యారు.



సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రోలుగుంట:గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి జనసేన కృషి చేస్తుందని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లగుడు కొత్తూరు, పాపంపేట గ్రామాల్లో జనసేన నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నెలకొన్న సమస్యలను రాజు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కరువు మండలాలుగా ప్రకటించాలని

పలు చోట్ల రైతుల ధర్నా



నక్కపల్లిలో ఆందోళన చేస్తున్న అప్పలరాజు, రైతులు



కోటవురట్లలో..

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిని కరువు మండలం గా ప్రకటించి రైతులను, కూలీలను అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ప్లకార్డులు, ఎండిన వరి చేనును చేత పట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 5125 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, వర్షపాతం లోటు కారణంగా 1219 ఎకరాల్లో మాత్రమే రైతులు వరి నాట్లు వేయడం జరిగిందన్నారు. వర్షాలు ముఖం చాటేయడంతో వేసిన వరి నాట్లు కూడా ఎండుతున్నాయని, దీంతో పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేసారు. ఎకరానికి 35 వేల నుండి 40 వేల వరకు రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, వరి పైరు ఎండి పోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు కొట్టు మిట్టాడుతున్నారన్నారు. చెరువులు, కాలువలు, బావుల్లో చుక్కనీరు కనిపించలేదన్నారు. వర్షాలు లేకపోవడంతో బీడు భూములుగా దర్శనమిస్తున్నాయన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలని, ఎకరానికి రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలని, ఆర్‌బికేల్లో తేలికపాటి విత్తనాలను రైతులకు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించి రైతులు, కూలీలను ఆదుకోవాలన్నారు. కరువు పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ అంబేద్కర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.అప్పారావు, ఎం.మహేష్‌బాబు, ఆర్.దండు బాబు, ఏ.అప్పలరాజు, ఏ.అప్పారావు పాల్గొన్నారు .

కోటవురట్ల:కరువు మండలంగా ప్రకటించి నివారణ చర్యలు చేపట్టాలని సిపిఐ నాయకులు మండలంలో పలు సచివాలయాల వద్ద నిరసనలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షులు వెలుగుల అర్జునరావు, ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ, పంటలు ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పరవాడ: మండలంలో పంటలు లేక రైతులు తీవ్రమైన నిరాశతో, ఆందోళనలో ఉన్నారని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరవాడ, తానాం, వెన్నెలపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో పర్యటించి కరువు పరిస్థితులను రైతులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు లేక వరి పంట వేయక పనులు లేక వ్యవసాయ కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పరవాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులు, వ్యవసాయ కార్మికులతో ఆందోళన చేపడతామని గనిశెట్టి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.అప్పారావు, జి.సన్యాసిరావు, కన్నమనాయుడు, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.